బలపరీక్షకు హాజరయ్యేందుకు హేమంత్‌కు అనుమతి

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ సోమవారం శాసనసభలో జరిగే బల పరీక్షలో పాల్గొనేందుకు పీఎంఎల్‌ఏ కోర్టు నుంచి అనుమతి లభించింది. చంపయి సొరేన్ బల పరీక్షలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని హేమంత్ కోర్టుకు చేసిన విజ్ఞప్తిపై ఈడీ అభ్యంతరం తెలిపిందని అడ్వకేట్ జనరల్ తెలిపారు. దీనినిబట్టి ఈ తతంగమంతా దర్యాప్తు కోసం కాదని, కొత్త ప్రభుత్వ ఏర్పాటును దెబ్బతీయడం, ప్రభుత్వాన్ని కూల్చడమే ఈడీ ఉద్దేశమని తాము చెప్పామన్నారు.

థాణాలో బీజేపీ ఎమ్మెల్యే కాల్పులు

ముంబై, (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్రలో ఓ బీజేపీ ఎమ్మెల్యే ఏకంగా పోలీస్ స్టేషన్లోనే తుపాకీ కాల్పులకు తెగబడ్డారు. శివసేన(షిండే వర్గం)కు చెందిన మాజీ కార్పొరేటర్ మహేశ్ గైక్వాడ్, ఆయన అనుచరులను చంపేందుకు థానె జిల్లా కల్యాణ్ (తూర్పు) నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్ ప్రయత్నించారు. ఎస్‌ఐ ఛాంబర్‌లో ఆరు రౌండ్ల పాటు తుపాకీ కాల్పులు జరిపారు. శుక్రవారం సాయంత్రం ఉల్హాస్‌నగర్‌లోని హిల్‌లైన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన సీసీటీవీ కెమెరా ఫుటేజ్ బయటకు విడుదలైంది. ఈ ఘటనలో బీజేపీ ఎమ్మెల్యే గణపత్ గైక్వాడ్‌ను, మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారిపై హత్యా నేరం సహా ఇతర నేరాల కింద కేసులు నమోదు చేశారు. కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డ మహేశ్ గైక్వాడ్ దవాఖానలో వైద్య చికిత్స పొందుతున్నారు.

పంజాబ్ గవర్నర్ రాజీనామా

చండీగఢ్: పంజాబ్ గవర్నర్, చండీగఢ్ అడ్మినిస్ట్రేటర్ బన్వరిలాల్ పురోహిత్ తన పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాసిన లేఖలో తన పదవులకు రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోపాటు, ఇతర పనులు ఉన్నందువల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ఆయన శుక్రవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు.

నాటకంలో సీత పాత్రధారి ధూమపానం

ముంబై: రామ్‌లీలా ఆధారంగా ప్రదర్శించిన ఓ నాటకంలో అభ్యంతరకర దృశ్యాలు, సంభాషణలు ఉన్నాయన్న ఆరోపణలపై మహారాష్ట్రలోని పుణె యూనివర్సిటీకి చెందిన ఓ ప్రొఫెసర్, ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదైంది. ఏబీవీపీ ఫిర్యాదు మేరకు వీరిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వర్సిటీలోని లలితకళా కేంద్రం లో శుక్రవారం సాయంత్రం నాటకం ప్రదర్శించారు. నాటకంలో భాగంగా సీత వేషం వేసిన పురుషుడు.. సిగరెట్ తాగాడని, అసభ్యకర భాష వాడాడని ఏబీవీపీ నేతలు ఆరోపించారు. ఈ నాటకంలో ఉద్దేశపూర్వకంగా హిందువుల మనోభావాలను దెబ్బ తీశారని పేర్కొన్నారు.

కిండల్, టిండర్ మధ్య జడ్జి కన్ఫ్యూజ్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఓ కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి అమెజాన్‌కు చెందిన ఈ-రీడింగ్ వేదిక 'కిండల్', పాపులర్ డేటింగ్ యాప్ 'టిండర్' పదాల మధ్య కొంత గందరగోళానికి గురి కావడం కోర్టు రూమ్‌లో నవ్వులు పూయించింది. గ్రామీణ ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించేందుకు గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ అనిరుద్ధ బోస్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఈ-లైబ్రరీలు, పుస్తకాల డిజిటలైజేషన్‌కు సంబంధించిన ప్రణాళికలు జరుగుతున్నాయని అడిషనల్ సొలిసిటర్ జనరల్(ఏఎస్‌జీ) విక్రమ్‌జిత్ బెనర్జీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జస్టిస్ సంజయ్ కుమార్ 'కొత్త పేజీని తిప్పడంలో కలిగే అనుభూతి, ఆనందం.. డిజిటల్ రీడింగ్‌లో ఎక్కడుంటుంది? దానిని మీరు ఏమని పిలుస్తారు? టిండర్?' అని అడిగారు. దీనికి 'తాను చెబుతున్నది కిండల్ గురించి..' అంటూ ఏఎస్‌జీ న్యాయమూర్తి వ్యాఖ్యలను సరిచేశారు. ప్రతిగా.. 'అవునవును. టిండర్ అనేది డేటింగ్ యాప్ కదా!' అంటూ జస్టిస్ సంజయ్ కుమార్ నవ్వుతూ బదులివ్వడంతో కోర్టులో నవ్వులు పూశాయి.

అద్వానీకి భారతరత్న

ఎక్స్‌లో వెల్లడించిన ప్రధాని.. పలువురు నేతల అభినందనలు

ఆశయాలు, సిద్ధాంతాలకు దక్కిన గౌరవమన్న కమలనాథుడు

రథయాత్రతో దేశ రాజకీయాల్లో, హిందువుల్లో గుర్తింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: బీజేపీ కురువృద్ధుడు, దేశ మాజీ ఉప ప్రధాని లాల్ కృష్ణ అద్వానీకి దేశ అత్యున్నతమైన పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఈ మేరకు ఎక్స్‌లో ప్రకటన చేశారు. అద్వానీ భారతరత్నకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని మోదీ పేర్కొన్నారు. 'ప్రస్తుత కాలంలో అత్యంత రాజనీతిజ్ఞుల్లో అద్వానీ ఒకరు. దేశ అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది. దేశ రాజకీయాల్లో కార్యకర్త స్థాయి నుంచి ఉప ప్రధాని వరకు ఆయన రాజకీయ జీవితం కొనసాగింది. ఆయన హోం మంత్రిగా పనిచేశారు. పార్లమెంట్‌లో ఆయన చేసిన ప్రసంగాలు ఎప్పుడూ ఆదర్శప్రాయంగా ఉంటాయి' అని మోదీ ప్రశంసించారు. 96 ఏండ్ల అద్వానీ వాజ్‌పేయి మంత్రివర్గంలో ఉప ప్రధానిగా పనిచేశారు. అదే సమయంలో పలు కేంద్ర శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 1970 నుంచి 2019 వరకు ఉభయ సభల్లో సభ్యుడిగా పనిచేశారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కోసం ఆయన కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశం మొత్తం రథయాత్ర చేశారు. ఈ యాత్ర హిందువులలో రామ మందిర నిర్మాణేచ్ఛ రగిల్చిందని చెప్తారు. ఈ యాత్ర వల్లే దేశంలో బీజేపీ క్షేత్ర స్థాయి నుంచి బలపడింది. బీజేపీని రెండు సీట్ల నుంచి ప్రధాని పీఠం వరకు నడిపించింది.

1990లో రథయాత్ర చేస్తున్న అద్వానీ (ఫైల్)

పలువురు నేతల అభినందనలు

అద్వానీకి భారతరత్న ప్రకటించడం పట్ల పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకులు, ఎన్సీపీ అధ్యక్షుడు పవార్ హర్షం వ్యక్తం చేశారు. భారత దేశ అభివృద్ధికి అద్వానీ అవిరళ కృషి చేశారని పవార్ ప్రశంసించారు. మరోవైపు తన తండ్రి దేశానికి చేసిన సేవలకు భారతరత్న ప్రకటించడం పట్ల అద్వానీ కుమారుడు జయంత్ అద్వానీ హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. 'నేను, మా కుటుంబ సభ్యులు దీనికి చాలా ఆనందపడుతున్నాం. దీనికి ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.' అంటూ ఆయన పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త నుంచి...

అవిభాజ్య భారత్‌లో 1927, నవంబర్ 8న కరాచీలోని సింధీ కుటుంబంలో జన్మించిన అద్వానీ అక్కడే సెయింట్ పాట్రిక్స్ స్కూల్‌లో చదివారు. తర్వాత 14 ఏండ్ల వయసులో 1941లో ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. దేశ విభజన సమయంలో ఢిల్లీకి వచ్చిన ఆయన తర్వాత రాజస్థాన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ అయ్యారు. మృదువుగా మాట్లాడినా, దృఢమైన నిర్ణయాలు తీసుకునే అద్వానీ రామజన్మభూమి ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారు. కాగా, అద్వానీ 2002 నుంచి 2004 వరకు ఏడో ఉప ప్రధానిగా సేవలందించారు. ఆయన బీజేపీ సహ వ్యవస్థాపకుల్లో ఒకరు. హోం శాఖకు ఎక్కువ కాలం పనిచేసిన మంత్రిగా, లోక్‌సభలో ఎక్కువ కాలం విపక్ష నేతగా వ్యవహరించి రికార్డు సృష్టించారు. 1970లో తొలిసారిగా రాజ్యసభ సభ్యునిగా ఎన్నికై 1989 వరకు కొనసాగారు. రామ జన్మభూమి ఉద్యమానికి 1980 తర్వాత రూపం తెచ్చారు.

వాజ్‌పేయితో కలిసి పార్టీ నిర్మాణం

1990 దశకంలో ఆయన వాజ్‌పేయితో కలిసి పార్టీ నిర్మాణానికి ఇటుక ఇటుక పేర్చి దాని పటిష్ఠానికి పునాది వేశారు. వారి కృషి కారణంగానే 1984లో పార్లమెంట్‌లో కేవలం రెండు సీట్లతో ఉన్న బీజేపీ 1989 నాటికి 86 సీట్లతో నిలిచింది. బీజేపీ ప్రారంభమైన తర్వాత దీర్ఘకాలం పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన రికార్డు అద్వానీ పేరుపైనే ఉంది.

రాజకీయ ప్రయోజనాలున్నాయా?

అయోధ్యలో రామజన్మభూమి ఆలయం కోసం అద్వానీ కన్న కలలు నిజమైన ఏడాదే ఆయనకు భారతరత్న ప్రకటించడం వెనుక అధికార బీజేపీ రాజకీయ ప్రయోజనాలున్నాయా? అన్న ప్రశ్నలు సైతం ఉద్భవించాయి. ఇటీవల అత్యంత ఘనంగా అయోధ్య రామ మందిరాన్ని ప్రధాని మోదీ ప్రారంభించడం రాబోయే సార్వత్రిక ఎన్నికలలో హిందూ ఓటు బ్యాంకును గంపగుత్తగా పొందడానికేనని కొందరు విమర్శలు చేస్తున్నారు. వారి విమర్శలకు ఊతం ఇచ్చేలా రామ మందిర నిర్మాణానికి తన రథయాత్ర ద్వారా శ్రీకారం చుట్టి హిందూ సమాజంలో ఒక విధమైన కసి రగిల్చిన అద్వానీకి భారతరత్న ఇవ్వడం ద్వారా హిందూ ఓటింగ్ బ్యాంక్‌ను మరింత సుస్థిరం చేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని భావిస్తున్నారు. ఈ అవార్డుతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెల్లుబుకుతుందని, అది సార్వత్రిక ఎన్నికల్లో టానిక్‌లా పనిచేస్తుందని భావిస్తున్నారు. కాగా, అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సమయాన ఆయనకు సరైన రీతిలో ఆహ్వానించకుండా అవమానించారన్న విమర్శలకు సైతం ఈ అవార్డు ఫుల్‌స్టాప్ పెట్టింది.

తప్పుడు నిర్ణయం: ఒవైసీ

బాబ్రీ మసీదును కూల్చేందుకు రథయాత్ర చేసిన వ్యక్తికి ప్రధాని నరేంద్ర మోదీ భారతరత్న ప్రకటించడం తప్పుడు నిర్ణయమని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. 1990లో అద్వానీ యాత్ర చేసిన ప్రాంతాల్లో మత ఘర్షణలు చెలరేగి పెద్ద సంఖ్యలో అమాయకులు చనిపోయారని తెలిపారు.

'కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలి'

దేశ ప్రజలు ఆర్థిక, సామాజిక సాధికారతను సాధించడానికి విశేషంగా కృషి చేసిన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించాలని ఆ పార్టీ శనివారం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అద్వానీకి భారతరత్న ప్రకటించిన కొద్ది సేపటికే ఆ పార్టీ ఈ విధంగా కోరింది. కాన్షీరామ్‌కు భారతరత్న ప్రకటించి గౌరవించాలని బీఎస్పీ నేత ఆకాశ్ ఆనంద్ శనివారం ఎక్స్‌లో కోరారు.

నేను దర్శించానని గుడిని శుభ్రం చేశారు

కనక గురు పీఠాధిపతి ఆరోపణ

ఈశ్వరానంద

బెంగళూరు : కురుబ సామాజిక వర్గానికి చెందిన కనక గురు పీఠం అధిపతి ఈశ్వరానంద పురి స్వామీజీ శుక్రవారం రాత్రి జరిగిన కన్నడ సాహితీ సదస్సులో సంచలన ఆరోపణలు చేశారు. 2023 డిసెంబరులో వైకుంఠ ఏకాదశి సందర్భంగా తాను చిత్రదుర్గ జిల్లాలోని బాగూరులో ఉన్న చెన్నకేశవ దేవాలయానికి వెళ్లి, స్వామిని దర్శించుకున్నానని చెప్పారు. తాను అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయిన తర్వాత అధికారులు ఆ దేవాలయాన్ని పూర్తిగా కడిగినట్లు తనకు తెలిసిందన్నారు. ఈ దేవాలయం రాష్ట్ర దేవాదాయ శాఖ పరిధిలోనిదేనని తనకు తెలిసి ఉంటే, తాను ధర్నా చేసి ఉండేవాడినన్నారు. ఆ దేవాలయం అర్చకుని కుటుంబంలోని మహిళలను తన కన్నా ముందు లోపలికి అనుమతించారన్నారు. తాను కూడా హిందూ మఠాధిపతినే అయినప్పటికీ తనను బయట వేచి ఉండేలా చేశారని ఆరోపించారు. ఇకపై తాను అన్ని దేవాలయాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నానని, దాని వల్ల అవి శుభ్రపడతాయని అన్నారు. కానీ బాగూరులోని చెన్నకేశవ దేవాలయానికి మాత్రం వెళ్లబోనని తెలిపారు. దీనిపై చెన్నకేశవ దేవాలయం పూజారి శ్రీనివాస్ విలేకర్లతో స్పందిస్తూ.. ఈశ్వరానంద స్వామీజీ ప్రతి సంవత్సరం ఇక్కడికి వచ్చి, స్వామివారిని దర్శనం చేసుకుంటారని, ఈసారి ఆయన వచ్చినపుడు దేవాలయాన్ని కడగడం వంటి సంఘటనలేవీ జరగలేదని చెప్పారు.

ఆర్టీఐ పరిధిలోనే సీబీఐ : ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: సీబీఐకి సమాచార హక్కు చట్టం నుంచి సంపూర్ణ మినహాయింపు లేదని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. అవినీతి, మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చేందుకు ఈ చట్టం అనుమతి ఇచ్చిందని చెప్పింది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి సంజీవ్ చతుర్వేది కోరిన సమాచారాన్ని అందజేయాలన్న సీఐసీ 2019 నాటి ఆదేశాల్ని హైకోర్టులో సీబీఐ సవాల్ చేయగా, సీఐసీకి అనుకూలంగా తీర్పు వెలువరించింది.

యూఎన్ఐ వేలంలో బీజేపీ ఎంపీ, అదానీ బంధువు బిడ్డింగ్

న్యూఢిల్లీ : వార్తా సంస్థ యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యూఎన్ఐ)ను వేలం వేసే ప్రక్రియ ప్రారంభమైంది. 'ది స్టేట్స్‌మన్' పత్రిక, 'ది బ్రెయిన్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా' ప్రతినిధిగా బీజేపీ ఎంపీ ఎంజే అక్బర్, కోల్‌కతాలోని ఫోర్ స్కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, 'చౌథీ దునియా' మాజీ ఎడిటర్ సంతోష్ భర్తియా, గౌతమ్ అదానీ బావ మరిది రాకేశ్ రమణ్ లాల్ షా యూఎన్ఐ బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నారు.

తాజ్‌మహల్‌లో ఉర్సును నిషేధించండి!

మార్చి 4న విచారిస్తామన్న న్యాయస్థానం

ఆగ్రా, ఫిబ్రవరి 3: తాజ్‌మహల్ వద్ద ఉర్సు నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ఆగ్రా కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీన్ని అఖిల భారత్ హిందూ మహాసభ దాఖలు చేసింది. ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు ఉర్సు నిర్వహించనున్నారని, దీనిపై నిషేధం విధించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరింది. ఉర్సు సందర్భంగా తాజ్‌మహల్‌లోనికి ఉచిత ప్రవేశానికి అనుమతిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తాజ్‌మహల్‌కు ప్రపంచవ్యాప్తంగా ఓ గుర్తింపు ఉన్నదని, అయితే దీన్ని నిర్మించిన షాజహాన్ చనిపోయిన సందర్భాన్ని పురస్కరించుకొని అక్కడ ఉర్సు నిర్వహించడం తగదని తెలిపింది. వాస్తవానికి తాజ్‌మహల్ లోపల ఉర్సును నిర్వహించడానికి అప్పట్లో మొఘలులు, బ్రిటీష్ వాళ్లు కూడా అనుమతించలేదని, ఈ విషయం సమాచార హక్కు చట్టం ద్వారా బయటపడిందని వెల్లడించింది. కాబట్టి ఈ నెల 6 నుంచి జరుగనున్న ఉర్సుపై నిషేధం విధించాలని కోరింది. ఈ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం మార్చి 4న విచారణ జరుపుతామని వెల్లడించింది.

అంకిత భావంతో పనిచేశా: అద్వానీ

అత్యంత వినయం, కృతజ్ఞతతో ఈ అవార్డును అంగీకరిస్తున్నట్టు అద్వానీ ప్రకటించారు. ఇది వ్యక్తిగా తనకొక్కడికే దక్కినది కాదని, తన ఆశయాలు, సిద్ధాంతాలకు లభించిన గౌరవంగా భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు. అవార్డు లభించిన సందర్భంగా దివంగత భార్య కమలతో పాటు తన కుటుంబ సభ్యులందరికీ ఆయన కృతజ్ఞతలు చెబుతూ జీవితంలో ఇంత దృఢంగా, నిబద్ధతతో ఉండటానికి వారి సహకారం మరువలేనిదన్నారు. 14 ఏండ్ల వయసులో ఆర్ఎస్ఎస్‌లో వలంటీర్‌గా చేరినప్పటి నుంచి తనకు అప్పగించిన ఏ పనినైనా నిస్వార్థంగా, అంకిత భావంతో చేసి దేశానికి సేవలందించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా తాను కలిసి పనిచేసిన ఇద్దరు గొప్ప వ్యక్తులను స్మరించుకుంటున్నానని, వారిలో ఒకరు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ కాగా, మరొకరు భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయని చెప్పారు. అలాగే పార్టీ నేతలు, కార్యకర్తలు, స్వయం సేవక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

• సముద్రపు దొంగల గుండెల్లో సంధాయక్

భారీ సర్వే నౌక ఐఎన్ఎస్ సంధాయక్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం విశాఖపట్నంలో జాతికి అంకితమిచ్చారు. హిందూ మహాసముద్రంపై గల్ఫ్ ఆఫ్ ఏడెన్, గల్ఫ్ ఆఫ్ గినియా వంటి కీలక ప్రదేశాలు ఉన్నాయని, సముద్ర దొంగతనాలు చేసేవారిని, స్మగ్లర్లను సహించేది లేదని రాజ్‌నాథ్ సింగ్ గట్టిగా హెచ్చరించారు.

ఇమ్రాన్ దంపతులకు ఏడేండ్ల జైలు

వివాహ చట్టం ఉల్లంఘన కేసులో కోర్టు తీర్పు

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 3: మరో వారంలో పాకిస్థాన్‌లో సాధారణ ఎన్నికలు జరుగనుండగా ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు దెబ్బ మీద దెబ్బ తగులుతున్నది. ఇప్పటికే పలు కేసుల్లో జైలు శిక్ష పడగా తాజాగా ఇస్లాం వివాహ చట్టం ఉల్లంఘన కేసులోనూ శిక్ష పడింది. ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీకి ఏడేండ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. ఇమ్రాన్, బుష్రా బీబీ ఇస్లామిక్ సంప్రదాయాల ప్రకారం పెండ్లి చేసుకోలేదని పేర్కొంటూ ఆమె మొదటి భర్త ఖవార్ మనేకా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రెండు పెండిండ్ల మధ్య ఖచ్చితంగా కొంత కాలం వ్యవధి ఉండాలన్న నియమాన్ని బుష్రా ఉల్లంఘించిందన్నారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఇమ్రాన్, బుష్రా ఇద్దరూ వేర్వేరుగా రూ.5 లక్షల జరిమానా చెల్లించాలని ఆదేశించింది.

ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 8న పాకిస్థాన్‌లో సాధారణ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అధికారులు చెప్పారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ కూడా పూర్తయ్యిందని వెల్లడించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

మా చేపల పడవల్లోకి ఎందుకెక్కారు?

భారత సిబ్బందికి మాల్దీవుల ప్రశ్న

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: లక్షద్వీప్ విషయంలో ఇప్పటికే వివాదం నెలకొన్న వేళ.. మాల్దీవులు మరో వివాదానికి తెర లేపింది. భారత్‌కు చెందిన కోస్ట్ గార్డ్ సిబ్బంది తమ ఫిషింగ్ బోట్లలోకి ఎక్కారని ఆరోపించింది. దీనిపై సమాధానం చెప్పాలని ఆ దేశ విదేశాంగ శాఖ ఈనెల 1న అధికారికంగా భారత ప్రభుత్వాన్ని కోరింది. తమ ఆర్థిక జోన్‌లో తిరుగుతున్న మూడు మాల్దీవుల ఫిషింగ్ బోట్లలోకి ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్‌లకు చెందిన సిబ్బంది బృందాలు ఎందుకు ఎక్కాయని ముయిజ్జు ప్రభుత్వం ప్రశ్నించింది.

ఇరాక్, సిరియాపై అమెరికా దాడులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఇటీవల జోర్డాన్‌లోని తన సైనిక స్థావరంపై జరిగిన దాడికి అమెరికా ప్రతీకార దాడులు చేపట్టింది. ఇరాక్, సిరియాలోని 85 లక్ష్యాలపై డ్రోన్లు, వైమానిక బాంబు దాడులతో విరుచుకుపడింది. ఇరాన్ మద్దతు గల మిలిటెంట్లు, ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ స్థావరాలపై దాడులు చేసింది. దాడుల్లో దాదాపు 40 మంది మరణించినట్టు తెలుస్తున్నది. అమెరికన్లకు హాని కలిగిస్తే మాత్రం ప్రతి చర్య ఇలాగే ఉంటుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు.

కేజ్రీవాల్‌పై ముప్పేట దాడి!

మద్యం పాలసీ కేసు, ఎమ్మెల్యేలకు ఎర, మొహల్లా క్లినిక్స్ ఆరోపణలపై కేంద్రం ఉచ్చు

- సీఎం ఇంటి వద్ద 5 గంటలు హైడ్రామా
- 'ఎమ్మెల్యేలకు బీజేపీ ఎర' ఆరోపణలపై నోటీసులు జారీ
- సీఎంకే ఇస్తామన్న ఢిల్లీ పోలీసులు
- మొహల్లా క్లినిక్కుల్లో అవినీతిని వెల్లడించిన ఏసీబీ
- మద్యం కేసులో సమన్లు తీసుకోలేదని కోర్టులో ఈడీ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఓ వైపు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ కోర్టుకు ఫిర్యాదు.. మరో వైపు తాను బీజేపీపై చేసిన ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ పోలీసుల నుంచి నోటీసులు.. మొహల్లా క్లినిక్కుల ల్యాబ్ పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఏసీబీ అధికారుల ప్రకటన. మొత్తంగా ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను టార్గెట్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం తన దాడిని ఉధృతం చేసింది! ఈ నేపథ్యంలో ఢిల్లీ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. నోటీసులు స్వయంగా సీఎం కేజ్రీవాల్‌కే ఇస్తామంటూ ఢిల్లీ పోలీసులు శనివారం సీఎం సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. దీంతో సీఎం కేజ్రీవాల్ అధికారిక నివాసం వద్ద కొన్ని గంటలపాటు హైడ్రామా నడిచింది. తమ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తున్నదని, ఒక్కో ఆప్ ఎమ్మెల్యేకి రూ.25 కోట్లు ఇచ్చి..ఏడుగురు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి బయటకు రప్పించేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని కేజ్రీవాల్ గత వారం ఆరోపించారు.

దీనిపై బీజేపీ నుంచి ఫిర్యాదు అందడంతో ఆరోపణలపై ఆధారాలు చూపాలంటూ నోటీసు జారీ చేయడానికి క్రైం బ్రాంచ్ బృందం ఆయన నివాసానికి చేరుకుంది. నోటీస్ కేజ్రీవాల్ పేరుపై ఉంది కాబట్టి స్వయంగా దానిని ఆయనకే అందజేస్తామని ఏసీపీ స్థాయి అధికారి పట్టుబట్టారు. అందుకు నిరాకరించిన సీఎం నివాస సిబ్బంది...నోటీసును తమకే ఇవ్వాలని, అది అందుకున్నట్టు రసీదు ఇస్తామని తెలిపారు. దీంతో దాదాపు ఐదు గంటలపాటు సీఎం ఇంటివద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఢిల్లీ పోలీసులకు, సీఎం సిబ్బందికి మధ్య వాగ్వాదానికి దారితీసింది. ఆ సమయంలో నివాసం బయట ఉన్న ఆప్ లీడర్ జాస్మిన్ షా పోలీసుల చర్యను తప్పుబట్టారు. సీఎం నివాసం ఎదుట డ్రామా కోసమే వీరిలా వ్యవహరించారని ఆరోపించారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే సీఎం కార్యాలయంలో నోటీసులు అందజేయలేదని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ విమర్శించారు. చివరికి..సీఎం సిబ్బందికి నోటీసులు అందజేస్తూ ఢిల్లీ పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఢిల్లీ మద్యం పాలసీ కేసులో సీఎం కేజ్రీవాల్ విచారణకు హాజరు కావటం లేదని, సమన్లు స్వీకరించటం లేదని ఇక్కడి ఓ కోర్టులో ఈడీ ఫిర్యాదు చేసింది. దీనిపై ఫిబ్రవరి 7న విచారణ చేపడతామని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దివ్యా మల్హోత్రా తెలిపారు.

'నకిలీ' రోగులకు పరీక్షలు

దాదాపు 65 వేల మందికి నకిలీ రోగులకు మొహల్లా క్లినిక్‌లలో గత ఏడాది రోగ నిర్ధారణ పరీక్షలు చేసినట్టు తమ ప్రాథమిక విచారణలో తేలిందని ఢిల్లీ అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) వెల్లడించింది. రెండు ప్రైవేటు ల్యాబ్‌లు గతేడాది ఫిబ్రవరి-డిసెంబర్ మధ్య దాదాపు 22 లక్షల పరీక్షలు జరిపాయని, వీటిలో 65 వేల పరీక్షలు నకిలీవని, తప్పుడు డాటాతో వాటిని సృష్టించాయని అధికారులు శనివారం మీడియాకు తెలిపారు. ఈ పరీక్షలు చేసినందుకు ఢిల్లీ ప్రభుత్వం ఆ ల్యాబ్‌లకు రూ.4.63 కోట్లు చెల్లింపులు చేసిందని పేర్కొన్నారు.

అవినీతిలో మకుటం లేని మారాజు

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అవినీతిలో మకుటం లేని మహారాజు అని, నిత్యం పరారీలోనే ఉంటారని బీజేపీ ఆరోపించింది. సీఎం ఇంటి వద్ద శనివారం జరిగిన పరిణామాలపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఐదుసార్లు సమన్లు జారీ చేసినా కేజ్రీవాల్ దర్యాప్తుకు సహకరించకుండా, ఈడీ ముందు హాజరు కాకుండా పరారీలో ఉన్నారని ఆరోపించారు.

ఆకాశానికి నిచ్చెన!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): అత్యాశలకు పోవడం లేదా సాధ్యంకానటువంటి పనులను ఎవరైనా మీదేసుకొన్న సందర్భాల్లో 'ఆకాశానికి నిచ్చెన వేయకు' అని అంటూ ఉంటాం. అయితే, ఇంగ్లండ్‌కు చెందిన జోర్డాన్ విలియమ్ అనే ఆర్కిటెక్ట్ నిజంగానే ఆకాశానికి నిచ్చెన వేయాలనుకొన్నాడు. అంతే, అనుకొన్నదే తడవుగా.. డిజైన్‌ను రూపొందించాడు. దీనికి పారిస్‌లోని ఓ ఫౌండేషన్ 8,617 పౌండ్లను (రూ. 9 లక్షలు) బహుమతిగా అందజేసింది. రోదసిలో భూదిగువ కక్ష్యలో తిరుగుతున్న ఓ ఆస్టరాయిడ్ నుంచి భూమి మీదకు ఓ కేబుల్‌ను ఏర్పాటు చేసి, దాని సాయంతో పెద్ద పెద్ద డ్రోన్స్ సాయంతో లిఫ్ట్ మాదిరిగా ఉండే గదుల్లో మనుషులను ఆకాశానికి తీసుకువెళ్లొచ్చని విలియమ్ చెబుతున్నాడు. తాను డిజైన్ చేసిన ఈ స్పేస్ ఎలివేటర్‌తో భవిష్యత్తులో భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తు వరకు మనుషులను తీసుకుపోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశాడు.



ఇనుములో హృదయం మొలిచెలే!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): 'ఇనుములో హృదయం మొలిచెలే..' అంటూ రోబో చిత్రంలో పాట పాడినట్టే ఓ చిప్‌లో సూక్ష్మమైన ఓ కృత్రిమ మనిషి గుండెను అమెరికా శాస్త్రవేత్తలు అమర్చారు. క్యాన్సర్ చికిత్సకు ఈ విధానం ఎంతగానో సాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు లాస్‌ఏంజెలిస్‌లోని సెడార్స్-సినాయి మెడికల్ సెంటర్ పరిశోధకులు వెల్లడించారు. క్యాన్సర్ చికిత్సలో ప్రాథమికంగా క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకొని మందులను వాడుతారు. అయితే, ఈ విధానంతో కొందరు గుండె జబ్బుల బారిన పడుతున్నట్టు పలు కేసుల్లో రుజువైంది. దీనికి పరిష్కారాన్ని కనుగొన్న అమెరికా పరిశోధకులు మనిషి మూలకణాలతో ఓ కృత్రిమ గుండెను ప్రయోగశాలలో తయారు చేశారు. దీన్ని ఓ చిప్‌పై అమర్చి కృత్రిమమేధ (ఏఐ) సాయంతో విశ్లేషించారు. తద్వారా క్యాన్సర్ చికిత్స కోసం వాడే మందులు ఈ గుండెపై ఎలా ప్రభావితం చూపిస్తున్నాయన్న దాన్ని కనిపెట్టారు. ఈ ఫలితాలను బట్టి గుండెజబ్బులు రాకుండా ఏ ప్రత్యామ్నాయ మార్గాలను తీసుకురావాలన్న దానిపై కసరత్తు మొదలుపెట్టారు. ఈ విధానం క్యాన్సర్ చికిత్సలో గొప్ప ముందడుగు అని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు.



భూమి తిరగడం ఆగిపోతే?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): హాలీవుడ్ సినిమా 'కోర్' చూశారా? తనచుట్టూ తాను తిరుగుతున్న భూమి ఒక్కసారిగా ఆగిపోవడంతో ప్రపంచమంతా అల్లకల్లోలంగా మారుతుంది. అది సినిమా. అయితే, నిజంగా భూమి తిరగడం ఆగిపోతే, ఏమౌతుందన్న దానిపై పరిశోధకులు తాజాగా అధ్యయనం చేశారు. భూమి తన అక్షం చుట్టూ (భూభ్రమణం) సెకన్‌కు 400 మీటర్ల వేగంతో తిరుగుతుందట. ఒకవేళ, ఉన్నట్టుండి ఈ తిరగడం ఆగిపోతే, పెను విధ్వంసమే దాపురిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. భూభ్రమణం మీదనే గురుత్వాకర్షణ శక్తి, అయస్కాంత శక్తి తదితరాలు ఆధారపడతాయని పరిశోధకులు పేర్కొన్నారు. భూమి తిరగడం ఆగిపోతే గురుత్వాకర్షణ శక్తి మాయమైపోయి సముద్రాలు పొంగొచ్చని, భూకంపాలు రావొచ్చని, సునామీలు విరుచుకుపడవచ్చని వాళ్లు పేర్కొంటున్నారు. మనుషులు గాలిలో తేలియాడవచ్చని చెబుతున్నారు. అయస్కాంతశక్తి లేకపోవడంతో పక్షులు సరైన దిశామార్గంలో ఎగరలేవని చెబుతున్నారు.